క్లుప్తంగా

చెవిరెడ్డి అక్రమ అరెస్టు దుర్మార్గం



ఒంగోలు సిటీ: మాజీ ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం కూటమి ప్రభుత్వానికి మంచి పద్ధతి కాదని ఒంగోలు నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కఠారి శంకరరావు గురువారం హెచ్చరించారు. అక్రమ అరెస్టులకు భవిష్యత్‌లో కూటమి సర్కార్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించుకుంది సూపర్ సిక్స్ పథకాలు ఆశించి అని, వాటిని విస్మరించి కూటమి సర్కార్ వైఎస్సార్ సీపీ నేతల అక్రమ అరెస్టులకు తెరలేపిందన్నారు. పథకాలను అమలు చేయకపోతే ప్రజలు నిలదీస్తారన్న ఆందోళనతో తమ నేతలను అరెస్టు చేస్తూ వీటిపైనే చర్చ జరిగేలా చేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కూటమి సర్కార్ చేస్తుందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పొదిలి పర్యటనకు వచ్చినప్పుడు జనసంద్రాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక అమాయకులైన కార్యకర్తలపై కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమిలోని పార్టీలు నామరూపాలు లేకుండా పోతుందని తెలిపారు.

గురుకులంలో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలోని ఏపీ గురుకుల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో వివిధ సబ్జెక్టులు బోధించుటకు అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టులు బోధించుటకు బీఈడీ అర్హత ఉండాలన్నారు. వంట పనిచేయడానికి కిచెన్ స్టాఫ్‌తో పాటు మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి స్కావెంజర్స్ కావాలని తెలిపారు. వివరాలకు 87126 25043 నంబర్‌ను సంప్రదించాలని ఆమె ప్రకటనలో తెలిపారు.

ప్రతి పంటకు ఈ-క్రాప్ తప్పనిసరి

కొత్తపట్నం: ఖరీఫ్ సీజన్‌కు సాగు చేసే ప్రతి పంటకు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జీ కిషోర్ బాబు అన్నారు. గురువారం మండలంలోని కే పల్లెపాలెం గ్రామంలో ఏవో ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు, సొంతగా సాగు చేసే రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. కౌలు రైతులు కౌలు కార్డుల కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. పంట వేయడానికి ముందు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ఉద్యాన అధికారి తేజ మాట్లాడుతూ పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి రాయితీ లభిస్తుందన్నారు. పశుసంవర్ధక శాఖ డాక్టర్ కే ప్రశాంతి మాట్లాడుతూ పాడి రైతులకు రాయతీపై జొన్నలు ఇస్తున్నామని చెప్పారు. అలాగే ఏపీసీఎన్ఎఫ్ ప్రతినిధి రెడ్డప్ప మాట్లాడుతూ సేంద్రియ విధానంలో పచ్చిరొట్ట పంటలు వేసుకోవాలన్నారు. దానిని 45 రోజుల తరువాత పశువులకు మేతగా ఉపయోగించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఏఈవో సీహెచ్ అజయ్ కుమార్, వీఏఏ శ్రావణ్, కల్పన, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వర స్వామి కల్యాణం



ఒంగోలు మెట్రో: భక్తిశ్రద్ధలతో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గురువారం నగరంలోని కేశవస్వామిపేట చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఉపాలయంగా విరాజిల్లుతున్న వేంకటేశ్వర స్వామి దేవాలయ 35వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గర్భాలయంలో శ్రీనివాసుని దివ్యమంగళ స్వరూపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విశేష అర్చనలు జరిపించారు. అనంతరం నక్షత్ర హారతి, కుంభ హారతి, కర్పూర హారతులను అందజేసి భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. అనంతరం దేవస్థాన ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం రమణీయంగా, నేత్రపర్వంగా సాగింది. కార్యక్రమంలో దేవస్థాన ఈవో రావెళ్ల శివశంకర్, అర్చకులు రామనాథాచార్యులు, అగ్నిహోత్రం శ్రీధరాచార్యులు, రాంబాబు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

లా సెట్‌లో యశ్వంత్‌కు 133 ర్యాంకు



ఒంగోలు సిటీ: ఏపీ లాసెట్‌లో శ్రీప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థి సుంకె యశ్వంత్ రాష్ట్ర స్థాయి 133 ర్యాంకు సాధించాడని విద్యా సంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం విడుదల చేసిన ఫలితాల్లో కళాశాలకు చెందిన యశ్వంత్ ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థిని అభినందించి మాట్లాడారు. యశ్వంత్ ఐదు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సుకు అడ్మిషన్ పరీక్షలో అత్యుత్తమ ఫలితాన్ని సాధించాడన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ నల్లూరి సీతా రామాంజనేయులు, సంస్థ సీఈవో నల్లూరి జయప్రకాశ్ నారాయణ్ పాల్గొన్నారు.

నాడు దర్జా.. నేడు దగా!

- సాగుకు సిద్ధమైనా.. అందని సాయం
- ఖరీఫ్ పనులు ప్రారంభం
- అన్నదాత సుఖీభవా సాయం దక్కేనా ?
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీజన్ ఆరంభంలోనే సాయం



పొలంలో దున్నడానికి వెళ్తున్న రైతన్న

చీమకుర్తి రూరల్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రైతులు పడిని కష్టాలు అన్నీఇన్నీ కావు. విత్తినప్పటి నుంచి పంట ఉత్పత్తుల గిట్టుబాటు ధర వరకు ప్రభుత్వం నిలువునా మోసం చేసింది. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని పండగ చేస్తే నేడు కూటమి సీఎం చంద్రబాబు నాయుడు దండగ చేశాడు. ఆయన సీఎం అయినప్పుడల్లా వ్యవసాయం సంక్షోభంలో ఉందని కొందరు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు కూటమి ప్రభుత్వం ఎలాంటి సాయం అందించలేదు. అరక చేతబట్టి పొలం బాట పట్టిన రైతులు దిగాలుతో వ్యవసాయ పనులు చేపడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఎలాంటి పెట్టుబడి సాయం అందించకుండా వ్యవసాయం దండగ అనే రీతిలోనే వ్యవహరిస్తోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేక అప్పులు చేసి వ్యవసాయ పనులు మొదలు పెడుతున్నామని వాపోతున్నారు. చీమకుర్తి మండలంలో 8050 మంది రైతులు అన్నదాత సుఖీభవా పథకానికి అర్హులుగా 800 మందికి రెవెన్యూ పరంగా చిక్కులు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. రైతులు ఆ సమస్యలను పరిష్కరించుకుంటే వారు కూడా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు అవుతారన్నారు.

గత ప్రభుత్వంలో రైతే రాజుగా..

రాష్ట్రంలో రైతే రాజుగా భావించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్నదాతల సంక్షేమానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా సీజన్ ప్రారంభంలోనే ఆర్థిక సాయం అందించారు. అయితే ప్రస్తుత కూటమి సర్కారు ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేల చొప్పున అందించాల్సి ఉండగా.. ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదు. ఈనేపథ్యంలో ఎప్పుడు పథకాన్ని అమలు చేసి సాయం అందిస్తారని రైతులు నిట్టూరుస్తున్నారు. అది విడత వారీగా అందిస్తామనడం రైతులను మరింత మోసం చేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చీమకుర్తి మండలంలో రైతులకు 2019 నుంచి 2024 వరకు రైతు భరోసా కేంద్రం ద్వారా సాయం అందించారు.

విత్తనాలు పంపిణీ (క్వింటాళ్లలో)	1333
రాయితీ మొత్తం	రూ. 42 లక్షలు
ఎరువుల పంపిణీ	350 టన్నులు
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు.. 2019-24	
లబ్ధిపొందిన రైతు కుటుంబాలు	454
మొత్తం లబ్ధి	రూ.183 లక్షలు
వైఎస్సార్ యంత్రసేవా పథకం.. 2019-24	
సీహెచ్‌సీ గ్రూపుల సంఖ్య	18
రాయితీ	రూ.125 లక్షలు
వైఎస్సార్ ఉచిత పంటల బీమా..2019-24	
లబ్ధి పొందిన రైతులు	2402
లబ్ధి	రూ.513 లక్షలు
ప్రకృతి వైపరీత్యాలు పంట నష్టపరిహారం..2019-24	
నష్టపోయిన రైతుల సంఖ్య	1982
పరిహారం	రూ.183 లక్షలు

అన్నదాత సుఖీభవా తక్షణమే అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. గత ఏడాదిలో రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు వ్యవసాయానికి ఆర్థిక సహాయం అందజేస్తామని మేనిఫెస్టోలో చంద్రబాబు చెప్పారు. కానీ రెండు సీజన్లు ఖరీఫ్, రబీ అయిపోయి మళ్లీ ఖరీఫ్ సీజన్ కూడా వచ్చింది. ఇప్పటి వరకు రైతులను పట్టించుకున్న పాపానా పోలేదు. ఇప్పటికైనా మీరు ఎన్నికల వాగ్దానాల్లో చెప్పినా అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు వెంటనే అమలు చేయాలి.

– బొడ్డు కోటేశ్వరరావు, ముప్పవారిపాలెం

గత ప్రభుత్వంలో మిర్చికి రూ.4.90 లక్షల పరిహారం..



నేను 2022లో 7 ఎకరాల్లో మిరప పంట వేశా. అప్పుడు రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవడంతో పంటకు ప్రభుత్వమే రైతుల పక్షాన బీమా ప్రీమియం మొత్తం చెల్లించింది. వర్షాల కారణంగా మిరప పంట దెబ్బతింది. నష్టపరిహారంగా నాకు రూ.4.90 లక్షలు అందింది. ప్రస్తుతం కూటమి పభుత్వం పట్టించుకోవడం లేదు.

– నల్లూరి చంద్ర, గుండువారి లక్ష్మీపురం

మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ సిబ్బంది

సంతనూతలపాడు: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. గురువారం మండలంలోని సంతనూతలపాడు నుంచి మైనంపాడు వెళ్లే రోడ్డులో అనధికారికంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తి నుంచి 8 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చీమకుర్తి ఎక్సైజ్ సీఐ ఎం సుకన్య తెలిపారు. ఎవరైనా మద్యం అమ్ముతుంటే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

సింగిల్ ఎల్‌పీఎంగా నమోదు చేయించుకోండి

చీమకుర్తి: జాయింట్ ఎల్‌పీఎంలుగా నమోదైన భూములను రైతులు సింగిల్ ఎల్‌పీఎంలుగా నమోదు చేయించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను పొందేందుకు వీలుగా అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. చీమకుర్తి మండలంలో 14 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతులకు అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమావేశానికి ఎమ్మెల్యే వస్తారా .. రారా ?

- నేడు చీమకుర్తి మండల సర్వసభ్య సమావేశం
- సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని ఎమ్మెల్యే విజయ్‌కుమార్



ఎంపీడీఓ కార్యాలయం, చీమకుర్తి

చీమకుర్తి రూరల్: గ్రామీణ ప్రాంతాలు బాగుంటే దేశం మొత్తం బాగుంటుందన్న విషయం మనందరికీ తెలుసు. అభివృద్ధి చేయాలన్నా, నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నా ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాల్సిందే. అయితే వీరిలో ప్రధానంగా మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంది. సమావేశంలో ప్రస్తావనకు వచ్చే సమస్యలకు పరిష్కార మార్గం చూపడంతో పాటు అందుకు అవసమైన నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుంది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏర్పాటై జూన్ 12 నాటికి ఏడాది కాలం పూర్తయింది. ఈ ఏడాది కాలంలో ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగుసార్లు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశాలకు స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ ఒక్కసారి కూడా హాజరుకాక పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే హాజరైతే మండలంలో ఉండే సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లడమో లేక అభివృద్ధి పనులపై చర్చించడమో జరుగుతుందని సభ్యులు అభిప్రాయపడుతున్నారు. గడిచిన ఏడాది కాలంగా స్థానిక ఎమ్మెల్యే ఒక్క సమావేశానికి కూడా హాజరుకాకపోవడంతో సమస్యలను ఎవరి దృష్టికి తీసుకెళ్లాలని సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

అదే కారణమా..?

మండలంలోని 24 పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు 20 మంది సర్పంచ్‌లుగా ఉండగా, నాలుగు పంచాయతీల్లో టీడీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉన్నారు. అలాగే 14 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 12 వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, 1 సీపీఎం కాగా, 1 టీడీపీ చెందినవారు ఉన్నారు. మెజారిటీ వర్గం వైఎస్సార్ సీపీ ఉండటంతో టీడీపీకి మింగుడు పడటం లేదు. నేడు జరగబోయే సమావేశానికైనా స్థానిక ఎమ్మెల్యే హాజరవుతారో లేదో వేచి చూడాలి.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన లారీ

మద్దిపాడు: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరోలారీ ఢీకొట్టడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని ఏడుగుండ్లపాడు ఫ్లైఓవర్‌పై గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న లారీ బ్రేక్ డౌన్ కావడంతో లారీడ్రైవర్ కిందకు దిగి లారీని పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి చెన్నైకు చెందిన లారీ వేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈక్రమంలో ఢీకొట్టిన లారీ డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుపోయాడు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది, మద్దిపాడు ఎస్సై శివరామయ్యలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో లారీ డ్రైవర్‌ను బయటకు తీసి అంబులెన్స్ ద్వారా ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. డైవర్‌కు తీవ్రగాయాలైనట్లు సమాచారం.



క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ని బయటకు తీస్తున్న స్థానికులు

వైభవంగా వెంకయ్య, బైనబోయినస్వామి గ్రామోత్సవం

సంతనూతలపాడు: మండల కేంద్రం సంతనూతలపాడులో వెలసిన భగవాన్ వెంకయ్యస్వామి, బైనబోయినస్వామి వార్ల ఆరాధన ఉత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. గురువారం పంచలోహ మూర్తికి, బైనబోయిన స్వామివారి మహా సమాధి వద్ద అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన, ముత్యాల పందిరిలో స్వామి వాళ్లకు ఊరేగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి శిష్యురాలు దుర్గమ్మచే అగ్ని గుండం ప్రజ్వలన వేడుకలు, కట్ట యోగి, హిమాలయ యోగి, పిఠాపురం దత్తపీఠం విశ్వానంద భారతిస్వామి, వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భక్తులకు ఈ సందర్భంగా వారు దైవ బోధనలను వివరించారు. స్వామివార్లకు పూలంగి సేవ, అష్టోత్తర పూజలు, భక్తులచే సత్సంగం, సంకీర్తన వేడుకలు నిర్వహించారు. హైదరాబాద్, జంగారెడ్డిగూడెం, విజయవాడ, నెల్లూరు, తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేడుకలకు విశేషంగా హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, మాజీ ఎంపీపీ దుంపా చెంచిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు దుంపా యల్లమందరెడ్డి, మాజీ సర్పంచ్ రంప తోటి అంకారావు, తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి

మార్కాపురం టౌన్: మార్కాపురం రవాణాశాఖ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యజమానులు తమ బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకుని, సర్టిఫికెట్లు పొందాలని ఎంవీఐ మాధవరావు సూచించారు. జిల్లా ఉప రవాణా అధికారి ఆదేశాల మేరకు గురువారం మార్కాపురంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్సుల్లో ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్, మెడికల్ కిట్, ఫైర్ సిలిండర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. తనిఖీల సమయంలో కిట్లు లేనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

మద్దిపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల అధికారులు, గ్రామ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్న క్రమంలో మండలంలోని ప్రతి గ్రామంలో ఈనెల 21వ తేదీన ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకూ గ్రామస్తులతో యోగా చేయాలని ఆయన సూచించారు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం నుంచి ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని 21వ తేదీ ఉదయం యోగాకు హాజరైయ్యే విధంగా చూసుకోవాలని ఆయన గ్రామ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రఘుబాబు, ఎంఈఓ ఎం శ్రీనివాసరావు, ఏఈ హౌసింగ్ విరించి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, ఏఓ స్వర్ణలత, ఏపీఓ ధనంజయ వర్మ, ఏపీఎం సుబ్బారావు, సీహెచ్‌ఓలు లలితమ్మ, రజితకుమారి, ఆర్‌ఐ రమణయ్య, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు పద్మ, నాగరాజ, జ్యోతి, పలువురు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



అధికారులు, కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

ప్రధాని మోదీ మెప్పు కోసమే యోగాంధ్ర

ఒంగోలు వన్‌టౌన్: యోగాంధ్ర పేరుతో ప్రధాని మోదీ మెప్పు కోసం కూటమి ప్రభుత్వం కోట్లు ప్రజాధనాన్ని ఖర్చు చేస్తోందని దళిత నాయకుడు నీలం నాగేంద్రరావు విమర్శించారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడుతూ గతంలో జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను జీవోలుగా ఇచ్చిన చంద్రబాబు ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డేను నిర్వహించడంలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా ఇంతవరకు ఎస్సీ కార్పొరేషన్‌కు మంజూరు చేసిన రూ.431 కోట్లలో ఒక్క రూపాయి కుడా విడుదల చేయలేదన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు 50 ఏళ్లలోపు అనే నిభందనను పెట్టి వంచన చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రరావు

టీటీడీ ఆధ్వర్యంలో యోగాంధ్ర



ఆంధ్రకేసరి కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఒంగోలు మెట్రో: తిరుమల, తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గురువారం నగరంలోని ఆంధ్రకేసరి విద్యాకేంద్రం ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించారు. పతంజలి పీఠానికి చెందిన ప్రముఖ యోగ గురూజీ గంధవల్ల బాలసుబ్రహ్మణ్యం యోగా ప్రాముఖ్యత, ప్రాచీనత, ఆధునిక జీవనశైలిలో దాని ప్రాసంగికతపై శ్రావ్యంగా మాట్లాడారు. విద్యార్థులతో కలిసి సూర్య నమస్కారాలు, యోగాసనాలు సామూహికంగా చేయించారు. అనంతరం యోగా గురువును కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ సెక్రటరీ పి. చెంచురామయ్య ప్రిన్సిపాల్ కె. వెంకటరెడ్డి, టీటీడీ సూపరింటెండెంట్ కాంతికుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

– కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి వార్ల దేవస్థాన ప్రాంగణంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు బాలాజీ వారి శిష్య బృందం సుధీర్, జనార్దన్ దేవస్థాన అర్చకులు, సిబ్బందితో ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో రామనాథాచార్యులు, నాగార్జునదేవ్, ప్రసాద శాస్త్రి, ఈవో శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు




బ్లాక్ బర్లీ కొనుగోలుకు ప్లాట్‌ఫాంను పరిశీలిస్తున్న అధికారులు

- ప్లాట్‌ఫాంను పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖాధికారి, మార్క్‌ఫెడ్ డీఎం

మద్దిపాడు: జిల్లాలోని 8 మండలాల్లో పొగాకు రైతులు పండించిన బ్లాక్ బర్లీ పొగాకును నేటి నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు మద్దిపాడు మండలం గుండ్లాపల్లి సమీపంలోని గార్లపాడు పునరావాస కాలనీ వద్ద ఉన్న గోడౌన్లను ఎంపిక చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసులు తెలిపారు. గురువారం మార్క్‌ఫెడ్ డీఎం కె.హరికృష్ణతో కలిసి సంబంధిత ప్లాట్‌ఫాంను శ్రీనివాసులు పరిశీలించి వివరాలు వెల్లడించారు. జిల్లాలోని నాగులుప్పలపాడు, చీమకుర్తి, దొనకొండ, పామూరు, ఒంగోలు, తాళ్లూరు, పొదిలి, ముండ్లమూరు మండలాలకు చెందిన పొగాకు రైతులు ఈ వేలం కేంద్రానికి రావాలని చెప్పారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకున్న వారి జాబితా తమకు వచ్చిందని, దాని ప్రకారం షెడ్యూల్ ఉంటుందని మార్క్‌ఫెడ్ డీఎం కె.హరికృష్ణ తెలిపారు. కేవలం బ్లాక్ బర్లీ పండించిన రైతులు మాత్రమే తమ పంట తీసుకురావాలని సూచించారు. శుక్రవారం ఉదయం పదిగంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్రారంభోత్సవానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే విజయ్‌కుమార్ హాజరవుతారన్నారు. ప్లాట్‌ఫాం పరిశీలన కార్యక్రమంలో తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, ఏఓ స్వర్ణలత, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, మార్క్‌ఫెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు ఇవ్వాలని ధర్నా



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

నాగులుప్పలపాడు: గ్రామ పంచాయతీ కార్మికులు జీతాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి టీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. మండలంలోని మేజరు పంచాయతీ అయిన ఉప్పుగుండూరులో పారిశుద్ధ్య కార్మికులు ఒక్కరోజు పనికి రాకపోతే గ్రామం అంతా మురికీకూపంగా మారతాయన్నారు. అటువంటి కార్మికులకు గత మూడు నెలల నుంచి జీతాల ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్మికులకు మద్దతుగా సర్పంచ్ దేవరకొండ జయమ్మ మాట్లాడుతూ నిధులు ఉన్నా కార్మికులకు జీతాలు పెట్టకుండా తనపై ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ కార్మికుల వద్దకు వచ్చి మీజీతాలు బిల్లులు జూన్ 5వ తేదీన పెట్టినట్లు ఫైలు చూపించి పరిశీలించి సోమవారం మీ జీతాలు చెల్లిస్తామని తెలిపారు. దాంతో స్పందించిన సర్పంచ్ 5న జీతాలు బిల్లులు పెటితే ఆ ఫైలు ఇప్పటివరకు ఎక్కడ ఉంది. నేను జీతాల బిల్లుమీద సంతకం పెట్టలేదని నాపై అసత్య ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. సామాజిక సేవాకార్యకర్త టీ శామ్యూల్ మాట్లాడుతూ కార్మికుల వెంటనే వారి జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నలతోటి రామారావు, కండ్లగుంట శ్రీనివాసరావు, పంచాయతీ కార్మికులు, మాదాసు సుబ్బారావు, మగ్గారావు, నలతోటి ఎలీషా, స్టాలిన్ మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.